31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

మంగళవారం 14 అక్టోబర్ 2025 పేజీలు : 8

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి

◆జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 13 :** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని అధికారులను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్లు,ఆర్డీఓలతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాలనుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని,అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు 2లో

-గొలుసుకట్టులో అందరు భాగస్వామ్యులే

-కేసుల్లో మాత్రం కానరాని పేర్లు

-అయోమయంలో పెట్టుబడిదారులు

# క్రిప్టో కేసుల్లో అసలు దొంగలు భద్రం






**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 13 :** జగిత్యాల జిల్లా కేంద్రంగా వివిధ పేర్లతో జిల్లాలో కొనసాగుతున్న క్రిప్టో కాయిన్ దందా నిర్వహించిన నిర్వహకులు 'మూడు రెట్లు లాభం వస్తుందని' ప్రజలను మభ్య పెట్టి పెట్టుబడులు సేకరించిన వివిధ బోగస్ కంపెనీలు ఇప్పుడు పేర్లు మార్చుకుంటూ మళ్లీ మార్కెట్‌లోకి దిగాయనే ఆరోపణలున్నాయి. క్రిప్టో బాధితులు కొంత మంది జిల్లాలో ఫిర్యాదులు చేస్తుంటే దీన్ని ఆసరాగా చేసుకొని క్రిప్టో కాయిన్ దందాలో, గొలుసుకట్టు వ్యాపారంలో జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, కొడిమ్యాల, రాయికల్ ప్రాంతాలకు చెందిన వారు వందల సంఖ్యలో టూ స్టార్లు, త్రీస్టార్లు, ఫోర్ స్టార్లు, ఫైవ్ స్టార్లు, సిక్స్ స్టార్లు,సెవెన్ స్టార్లుగా కోట్ల రూపాయాల దందా నిర్వహించి దుబాయి, థాయిలాండ్, సింగపూర్, మలేషియా టూర్లకు వెళ్లిన వారు, స్థానికంగా హంగామా చేసినవారంతా ప్రస్తుతం ఈ కేసుల నుండి తప్పించుకోవడానికి బాధితుల కంటే ముందే ఫిర్యాదు అందిస్తూ అసలు దొంగలే భద్రంగా ఉంటున్నారని పలువురు డిపాజిట్ దారులు పేర్కొంటున్నారు. -2లో

## దేశ రక్షణతో పాటు ఆర్థిక వ్యవస్థ రక్షణ కూడా ప్రధానం

◆ఆర్థిక మోసాలను అరికట్టేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి

◆పోలీసులు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలి

◆మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 13 :** దేశ రక్షణతో పాటు ఆర్థిక వ్యవస్థ రక్షణ కూడా ప్రధానమని, రాష్ట్ర పరిధిలో ఆర్థిక మోసాలను అరికట్టేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని, క్రిప్టో మోసాలపై పోలీసులు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధిక లాభా పేక్షతో పెట్టుబడులు పెట్టి అమాయక ప్రజలు మోసపోతున్నా రన్నారు. ఫేక్ యాప్ల ద్వారా అధిక లాభాపేక్షను ఎర చూపి, గ్రామీణ ప్రజలతో పాటు వివిధ హెూదాల్లో ఉన్నవారు సైతం మెట్ ఫండ్,యు బిట్ లలో చైన్ విధానంలో పెట్టుబడులు పెట్టి మోసపోతున్నా రన్నారు.పెట్టుబడి దారులకు విదేశీ టూర్లు,లగ్జరీ వసతుల పేరిట అమా యక ప్రజలు ఆకర్షితులు అవుతున్నా రని,గతంలో ఫైనాన్స్ కంపెనీలు రెగ్యులేటరీ లేదు.. ప్రస్తుతం క్రిప్టో కరెన్సీ పేరిట నకిలీ యాప్లు, వెబ్ సైట్లు విస్తరించాయని, ఆర్బిఐ అనుమతులు లేకుండా చేపట్టే ఏ ఆర్థిక కార్యక్రమాలు అయినా చట్ట విరుద్ధమేనన్నారు. కేవలం జగిత్యాల జిల్లాలోనే సుమారు 1000 కోట్లు మోసపోయినట్లు లెక్కలు చెబుతు న్నాయన్నారు.పెట్టుబడులు పెట్టిన వారికి ఏవిధమైన రశీదులు లేకుండానే పెట్టుబడులు పెడుతున్నారని, క్షణాల వ్యవధిలో యాప్‌లు తొలగిస్తూ ఆధారాలు లేకుండా చేస్తున్నారన్నారు. జగిత్యాల పోలీసు యంత్రాంగం కేసులు నమోదు చేయడం అభినందనీయమని, నకిలీ 2లో

భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా

## రాజన్న ఆలయ అభివృద్ధి

◆అందరి సలహాలు, సూచనల మేరకు గుడి అభివృద్ధి, విస్తరణ పనులు చేయిస్తాం

◆ఆలయ అభివృద్ధి, విస్తరణకు అందరూ సహకరించాలి

◆ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 13 :** భక్తుల విశ్వాసాలు, మనోభావాలకు అనుగుణంగా రాజన్న ఆలయ అభివృద్ధి,విస్తరణ పనులు చేపడుతామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధిపై ఆలయ ఆవరణలోని చైర్మెన్ గెస్ట్ హౌస్ లో ప్రభుత్వ విప్ ఆదివారం మాట్లా డారు.శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి,వాస్తు,పండితులు,అర్చకులు పట్టణ ప్రముఖుల సలహాలు, సూచనల మేరకు ప్రజా ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి రాజన్న ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టారని తెలిపారు.రూ. 150 కోట్లతో ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు మొదలు అయ్యాయని వివరించారు.రూ.47కోట్లతో ప్రధాన రహదారి విస్తరణ 2లో

## ఆర్థిక సహాయం అందజేత

**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 13 :** జగిత్యాల పట్టణానికి చెందిన మచ్చ గంగారాం ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబానికి శ్రీ భక్త మార్కండేయ యువజన స్వచ్ఛంద సేవా సమితి అండగా నిలిచింది. సోమవారం మృతుని కుటుంబానికి రూ.11 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బత్తిని శ్రీనివాస్, కళాశ్రీ గుండేటి రాజు, అలిశెట్టి రాజు, కొక్కుల సుదర్శన్, సంగీత శ్రీనివాస్, మల్లేశం, శంకర్, శేఖర్, శంకర్, శ్రీనివాస్, దయాకర్, ప్రకాష్, శ్రీనివాస్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ చీఫ్ పదవి ఏవరకి దెక్కేను

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఆక్టోబర్ 13 :** సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ అధిష్టానం దృష్టి పెట్టింది. డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ పూర్తిచేసే దిశగా సంఘటన్ సృజన్ అభియాన్ పేరిట ఏఐసీసీ 22 మంది సీనియర్ నేతలను పరిశీలకులుగా తెలంగాణకు పంపించింది. వీరు జిల్లాల పర్యటన మొదలుపెట్టారు. ప్రతి జిల్లా నుంచి ఐదు నుంచి ఆరుగురు పేర్లు అక్టోబరు 15 తేదీలోగా హై కమాండ్‌కు పరిశీలకుల బృందం పంపిస్తుంది. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో సందడి ఏర్పడింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల కాలం దగ్గర పడుతున్నా మార్కెట్ కమిటీల పదవులు మినహా నామినేటెడ్ నజరానాలు, పార్టీ పదవులు లేకపోగా స్థానిక సంస్థల పదవులు కూడా లేక కాంగ్రెస్ శ్రేణులు డీలా పడుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుల్లో ఉత్సాహం నింపే విధంగా పార్టీ సంస్థాగతంగా కమిటీల నియామకం అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది. అయితే జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న అంతర్గత విభేదాలు డీసీసీ నియామకాలు సమన్వయం చేయడం సవాల్‌గానే ఉంటుందని చర్చ జరుగుతోంది. జూలై మాసంలో గ్రామ, పట్టణ కమిటీలను ఏర్పాటు చేసే దిశగా కసరత్తు ప్రారంభించిన స్థానిక సంస్థ ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయింది తాజాగా జిల్లా కార్యవర్గాల భర్తీకి అధిష్ఠానం కసరత్తు ప్రారంభించడంతో పార్టీలోని సీనియర్ నాయకులు పదవులు వరిస్తాయనే ఆశలు పెంచుకున్నారు.

**డీసీసీ రేసులో ఆశావహుల పోటాపోటీ...**

స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడడంతో త్వరగా జిల్లా కార్యవర్గం పూర్తిచేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి దరఖాస్తులు స్వీకరించి అధిష్ఠానానికి నివేదిక పంపించే ప్రక్రియ ముందుకు వచ్చింది. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పదవులు కూడా గౌరవంగా ఉంటుందని అనేకమంది ఆశావహులు ముందుకు వస్తున్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులకు అధ్యక్ష పదవి కట్టబెట్టేందుకు అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. . జిల్లాలో ప్రతి మండలం నుంచి సీనియర్లు అధ్యక్ష పదవి రేసులోకి రావడం కమిటీపై ఊహాగానాలు పెరిగాయి. జిల్లాలో అధ్యక్ష పదవి ఆశిస్తున్న వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు సంగీతం శ్రీనివాస్. గడ్డం నర్సయ్య, మాజీ మండలాధ్యక్షుడు వైద్య శివప్రసాద్, కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు కుస రవీందర్, పార్లమెంట్ కో కన్వీనర్ లు మాజీ ఎమ్మెల్యే ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సీనియర్ అధికార ప్రతినిధి కటుకం మృత్యుంజయం,  కానమేని చక్రధర్‌రెడ్డి, కొండూరి గాంధీ రావు, రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి చీటీ ఉమేష్ రావు జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్, మాజీ జట్పీటీసీ నాగం కుమార్, మాజీ కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు చంద్రశేఖర్,  ఎల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్ నెవూరి వెంకట్రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోమ్మాటి నరసయ్య,  డీసీసీ పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు.

**ఆది, కేకే లే కీలకం...**

రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష, కార్యవర్గ నియామకాల్లో ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిల సూచనలే కీలకం కానుట్లు చెప్పుకుంటున్నారు. దీంతో ఆశావహులు వారి చుట్టూ చెక్కర్లు కొడుతున్నట్లు తెలుస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పడిన తర్వాత తొలి అధ్యక్షుడిగా నాగుల సత్యనారాయణగౌడ్ పనిచేశారు. ప్రస్తుతం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధ్యక్షుడిగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ పార్టీపరంగా జిల్లాలో స్తబ్దత నెలకొందని చెప్పుకోవచ్చు. కాంగ్రెస్ పార్టీ నుంచి గతంలో బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లినవారు తిరిగి సొంతగూటికి చేరుకున్న వారు ఉన్నారు. ప్రస్తుతం వారు కూడా పార్టీ పదవులకు ముందుకు వస్తుండడంతో పార్టీని నమ్ముకున్న వారి నుంచి వ్యతిరేకతలు మొదలు కావడంతో నియామకాలపై ఆసక్తి నెలకొంది.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి

**మొదటి పేజీ తరువాయి...**సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అర్జీలను  ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 55 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని  సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. ఎస్ లత, బి.రాజగౌడ్, జగిత్యాల, మెట్ పల్లి, కోరుట్ల ఆర్డీఓలు మధు సూధన్, శ్రీనివాస్, జీవాకర్ రెడ్డి , వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు

**-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 13 :** బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటూన్నామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 10 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని,పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

# దేశ రక్షణతో పాటు ఆర్థిక వ్యవస్థ రక్షణ కూడా ప్రధానం

**మొదటి పేజీ తరువాయి...** యాప్లలో పెట్టుబడులు పెట్టి మోస పోయిన వారు పోలీసుల దృష్టికి వచ్చేది ఒక్క శాతం కూడా లేదని, ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, జూదం అరికట్టేందుకు చర్యలు చేపడుతోందని,చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు,రికవరీ అవుతుందో లేదో అని భయపడి కేసు పెట్టేందుకు ముందుకురావడం లేదన్నారు.నకిలీ యాప్‌లలో అమాయక ప్రజలను పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించిన వారి ఆస్తులు జప్తు చేయాలన్నారు. పోలీసులు కేసులు నమోదు చేయడం తోపాటు రికవరీ చేస్తామనే విశ్వాసం బాధితుల్లో కల్పిస్తేనే ఫిర్యాదు చేసేందుకు ముందుకు వస్తారన్నారు.రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు తగ్గిపోయి, ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని,ఆర్బిఐ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఆర్థిక కార్యకలా పాలు దేశ ఆర్థిక వ్యవస్థ పై ప్రభావం చూపుతుందని,దేశ రక్షణతో పాటు ఆర్థిక వ్యవస్థ కక్షణ కూడా ప్రధానమని,రాష్ట్ర పరిధిలో ఏ మేరకు నిలుపుదల చేస్తామని పరిశీలించి ఆర్థిక మోసాలు అరికట్టేలా చర్యలు చేపట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.కేంద్ర హోమ్ శాఖ, ఆర్థికశాఖ సైతం నకిలీయాప్‌లు, వెబ్సైట్‌లలో పెట్టుబడులను అరికట్టేలా చొరవ తీసుకోవాలని,నకిలీ యాప్‌లలో పెట్టుబడులు పెట్టీ మోసపోవడం జగిత్యాల జిల్లాకే పరిమితం కాలేదని,బాధితులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నారని,పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకొని,ఆర్థిక నేరాలు చేసిన వారి ఆస్తులు జప్తు చేయాలన్నారు. పోలీసులు సుమోటోగా విచారణ చేపట్టాలని,పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి,ఆర్థిక నేరాల వ్యవహారాలను అరి కట్టేందుకు చర్యలు చేపట్టాలని సీఎంకి విజ్ఞప్తి చేశారు.

# భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా రాజన్న ఆలయ అభివృద్ధి

**మొదటి పేజీ తరువాయి...** పనులు ఇటీవల ప్రారంభించామని వివరించారు.రాజన్న భక్తులకు సులభంగా వేగంగా దర్శనం, వసతి కల్పించాలని ఉద్దేశంతో ఆలయ అభివృద్ధి, విస్తరణ నేపథ్యంలో భీమేశ్వరాలయంలో మొక్కులు, ఇతర పూజలు చేసుకునేందుకు రూ. 3. కోట్ల 48 లక్షలతో ఏర్పాట్లు చేశామని తెలిపారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు యధావిధిగా అన్ని పూజలు, అభిషేకాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.రాజన్న ఆలయంలో భారీ యంత్రాలతో పనులు జరిగే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా.. భక్తుల భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రత్యామ్నాయంగా భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశామని తెలిపారు.రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ అనేది భక్తుల ఎజెండా అని పేర్కొన్నారు. భక్తుల కోసం ఎవరు ఎలాంటి సూచనలు చేసిన తప్పకుండా గౌరవిస్తామని స్పష్టం చేశారు.అందరి సలహాలు సూచనల మేరకు పనులు చేపడుతామని విప్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం చేయిస్తున్న పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.సమావేశంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# క్రిప్టో కేసుల్లో...అసలు దొంగలు...

**మొదటి పేజీ తరువాయి...**

క్రిప్టో కరెన్సీ గొలుసుకట్టు దందాలో చాలా నుంది పెట్టుబడి దారులు కొందరు హవాలా ద్వారా, యుఎస్ డాలర్ రూపంలో చెల్లించినట్లు తెలుస్తుంది. జిల్లాలో చాలా మంది ఈ తరహా చెల్లింపులు చేయడంతో ఫిర్యాదులు చేయడానికి వారి వద్ద ఆధారాలు లేకపోవడంతో దీన్ని ఆసరాగాచేసుకొని 'కీ' రోల్ గా వ్యవహరించిన వారు తప్పించుకుంటున్నారని తెలుస్తుంది. గత వారం రోజులుగా జిల్లా పోలీస్ యంత్రాంగం క్రిప్టో గొలుసుకట్టు వ్యాపారంలో కీలకంగా ఉన్న వారిపై ఉక్కుపాదం మోపడంతో కొందరు తెలివిగా తమ క్రింది స్థాయి వారు, డిపాజిటర్ల నుండి తప్పించుకోవడానికి, నిన్నటి వరకు వ్యాపారంలో భాగస్వామ్యం ఉన్న వారు కూడా కోట్ల రూపాయాల పెట్టుబడి పెట్టినట్లు ఫిర్యాదులు సిద్ధం చేస్తూ, తమ క్రింది స్థాయిలో పెట్టుబడులు పెట్టిన వారి నుండి తప్పించుకుంటున్నారనే విమర్శలున్నాయి. ఈ గొలుసుకట్టు వ్యాపారంలో 'కీ' రోల్ లో ఉన్న వారితో విదేశాలకు వెళ్లిన ఫోటోలు వారు ఇటీవలే కొనుగోలుచేసిన ఆస్తులు, వారి బ్యాంకు ఖాతాల లావాదేవిలను లోతుగా పరిశీలిస్తే ఇంకా చాలా మంది పేర్లు బయటకు వచ్చే అవకాశాలున్నాయని పలువురు పెట్టుబడి పెట్టిన వారు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంలో అధికంగా పెద్ద మొత్తంలో హవాకా, యూఎస్ డాలర్ల రూపంలో చెల్లింపులు జరగడంతో దీనిపై పరిజ్ఞానం లేకపోవడం, ఈ దిశగా విచారణ జరపకపోవడంతో గొలుసుకట్టు నుండి చాలా మంది తప్పించుకుంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. క్రిప్టో కరెన్సీ వ్యాపారంలో కోట్ల రూపాయాలు నష్టపోయామని కొందరు ముందుకు వస్తున్న ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడులు, బ్యాంకుల ద్వారా జరిపిన లావాదేవిల విషయంలో ఇప్పటి వరకు ఆదాయపు పన్ను శాఖ రంగంలోకి దిగకపోవడం గమనార్హం. కొందరు కోట్ల రూపాయాలు బ్యాంకుల ద్వారా బదిలీ చేస్తే, ఇంకొందరు కోట్ల రూపాయాలు హవాలా, యూఎస్ డాలర్ల రూపంలో చెల్లించినట్లు సమాచారం. హవాలా, యూఎస్ డాలర్ల రూపంలో చెల్లింపులు కూడా 'ఫెరా' నిబంధనల ఉల్లంఘనల కిందకు వస్తుందని తెలుస్తుంది. కొందరు భాగస్వామ్యులుగా ఉన్న ఈ వ్యవహారంలో తమపై ఎప్పుడు ఎవరు ఫిర్యాదులు చేస్తారోనని, తాము సేఫ్ కావడానికి బాధితుల కన్నా ముందే భాగస్వామ్యులు ఫిర్యాదులు చేస్తున్నట్లు తెల్సింది. కీలకంగా ఉన్న వారిలో కొందరు దేశం దాటగా, మరికొందరు పైరవి"కారులను ఆశ్రయించి, బాధితుల కన్నా ముందే ఫిర్యాదులు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. క్రిప్టో వ్యవహారం అంతా నింబంధనలకు విరుద్ధంగా జరగడంతో పాటు కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా దీనిపై విచారణ చేపట్టకపోవడంతో ఓ వైపు కేసులు నమోదవుతున్న మరో వైపు లండన్ ట్రిప్ పేరుతో మరో కంపెనీ భారీ మోసం కోసం స్కెచ్ వేసినట్లు, ఆ దిశగా పలువురు తమ టార్గెట్లను పూర్తి చేసినట్లు సమాచారం.

**ఇద్దరిని రిమాండ్ కు తరలించిన జగిత్యాల పోలీసులు......**

క్రిప్టో మోసం కేసులో జగిత్యాల పట్టణానికి చెందిన ఫజిల్ అహ్మద్ అనే వ్యక్తి రూ.5 లక్షలు మోసపోయానని, మరో వ్యక్తి అనుమల్ల రాజేందర్ అనే వ్యక్తి తాను రూ.1.45 కోట్లు మోసపోయానని జగిత్యాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వెంకటేశ్వర్ రావు, శ్యామ్ సుందర్ లపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. వారి వద్ద నుండి 5.40 లక్షల నగదును రికవరి చేసినట్లు జగిత్యాల టౌన్ ఇన్స్ పెక్టర్ పి.కరుణాకర్ తెలిపారు.

# ప్రత్యక్ష వీక్షణతో .. పాఠ్యాంశాములపై పట్టు..

**చురకలు విలేకరి, రాయికల్, అక్టోబర్ 13 :** తరగతి గదిలో బోధించే అంశాలను ప్రత్యక్ష వీక్షణతో పాఠ్యాంశాలపై విద్యార్థులు పట్టు సాధిస్తారని ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ బాలే జయశ్రీ శేఖర్ అన్నారు.సోమవారం రాయికల్ పట్టణంలోని ప్రగతి స్కూల్ ఆవరణలో విద్యార్థులకు సైన్స్ పాఠాలను 3డి ప్లానిటోరియం విజ్ఞాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఒకటో తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులు నక్షత్రాలు, గ్రహాలు, గెలాక్సీల అద్భుత ప్రపంచాన్ని ప్రత్యక్షంగా వీక్షించి మంత్రముగ్ధులయ్యారు.ప్రైమరీ




విద్యార్థులకు సౌరమండల పరిచయం, భూమి-చంద్రుని కదలికలు,పగలు-రాత్రి మార్పు, ఋతువుల మార్పు వంటి అంశాలను సరళంగా వీక్షించి నేర్చుకున్నారు.హైస్కూల్ విద్యార్థులకు నక్షత్ర సమూహాలు,గెలాక్సీలు,బ్లాక్ హోల్‌లు,అంతరిక్ష పరిశోధనలు, ఉప గ్రహాల ప్రయాణం వంటి అధు నాతన విషయాలను 3డి రూపంలో ప్రదర్శిం చారు.విద్యార్థులు తాము తరగతుల్లో చదివిన విషయాలను ప్రత్యక్షంగా వీక్షించడంతో ఆసక్తితో తిలకించారు. శాస్త్ర విజ్ఞానం, ఖగోళ శాస్త్రంపై ఆసక్తి కలిగించే కార్యక్రమం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయడంతో విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. విజ్ఞానం వినోదంతో మిళితమైతేనే విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి ఏర్పడుతుందని ప్రదర్శనలు పిల్లల్లో ఊహాశక్తి, ప్రశ్నించే స్వభావం, పరిశోధనా దృక్పథం పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# వినియోగదారుల కోసం విద్యుత్ సంస్కరణలు

**-సబ్ స్టేషన్లలో అదన పీటీఆర్ల ఏర్పాటు**
**-జగిత్యాల జిల్లా విధ్యుత్ శాఖ ఎస్ ఈ సుదర్శనం**

**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆక్టోబర్ (13) :** వినియోగదారుల కోసం విద్యుత్ సంస్కరణలు సంస్థ చేపడుతుందని,సబ్ స్టేషన్లలో అదన పీటీఆర్ల ఎర్పాటు చేసి విద్యుత్ వినియోగదారులకు కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించే లక్ష్యంగా పనిచేస్తున్నామని జగిత్యాల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ ఈ సుదర్శనం



అన్నారు.సోమవారం జిల్లా లోని ఇబ్రహీంపట్నం మండలం మేడిపల్లి (ప) సెక్షన్‌లో,అమ్మక్కపేట్,ఎర్దండి సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్ఫార్మర్‌ను, వర్షకొండ సబ్ స్టేషన్‌లో అదనపు బ్రేకర్‌లను సాంకేతికంగా టెస్ట్ ఛార్జ్ చేసి ప్రారంభించారు.ఈసందర్భంగా ఎస్ ఈ మాట్లాడుతూ టీజియన్ పిడి సి యల్ సియండీ కర్ణాటి వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు విద్యుత్ సబ్టేషన్ పరిశీలిస్తూ అవసరం మేరకు నూతన సంస్కరణలను చేపడుతున్నామని సూచించారు.వర్షకొండ సబ్ స్టేషన్ లో ఇప్పటివరకు రెండు లైన్ లకు ఒకే విసిబి ద్వారా విద్యుత్ సరఫరా అవుతుంది,విద్యుత్ వినియోగ దారులకు సరఫరా అంతరాయం లను తగ్గించడానికి సాంకేతికంగా టెస్ట్ చేసినట్లు ఎస్ఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డీఈ గంగారం, కన్స్ట్రక్షన్ డీఈ గోపికృష్ణ ,మెట్‌పల్లి డి ఈ మధుసూదన్,ప్రొటెక్షన్ ఏడీఈ ఈఎల్వి రాజు,మల్లాపూర్ ఎడిఈ ప్రదీప్ మేడిపల్లి సెక్షన్ ఏ ఈ ప్రశాంత్, ఇబ్రహీంపట్నం ఏ ఈ సతీష్ ,మేడిపల్లి(ప) ఇబ్రహీంపట్నం మండల విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పార్టీ అధిష్టానం ఆదేశిస్తే డీసీసీ అధ్యక్షుని

# పదవి బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమే

**-టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి**

**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 13 :** కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టేందుకు తాను సిద్ధమేనని టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్, న్యాయవాది శేర్ నర్సారెడ్డి వెల్లడించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో వెనుకబడిన తరగతుల కమ్యూనిటీలోని బలమైన మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన తనకు జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అవకాశం కల్పిస్తే రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ జువ్వాడి నరసింగరావులతో పాటు జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులందరీ సహకారంతో,సూచనలతో జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తాను పూర్తి సమయాన్ని కేటాయిస్తానని తెలిపారు.1990 సంవత్సరంలో విద్యార్థి రాజకీయాల్లో ప్రవేశించిన తాను ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎన్ఎస్ యుఐ ఉపాధ్యక్షుడిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్ఎస్ యుఐ కో - ఆర్డినేటర్ గా, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి గా, ఓబిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, టిపిసిసి రాష్ట్ర కార్యదర్శిగా, జగిత్యాల మున్నూరు కాపు యువత జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించి ప్రస్తుతం తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోనసాగుతున్నానని పేర్కొన్నారు.గతంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయంలోనూ ఎలాంటి నామినేటెడ్ పోస్టులను కేటాయించ



కుండా తనకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.1990 సంవత్సరం నుండి నేటి వరకు దాదాపు 35 సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీకి నిస్వార్ధంగా, అంకిత భావంతో,పూర్తి సమయాన్ని కేటాయిస్తూ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్న తనకు జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని శేర్ నర్సారెడ్డి కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు.

# నిత్యసాయి చారిటేబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆస్పత్రి ప్రారంభం

**చురకలు విలేకరి,మెట్‌పల్లి, అక్టోబర్ 13 :** మెట్ పల్లి పట్టణంలోని నిత్యసాయి చారిటేబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్, రాష్ట్ర బిజెపి నాయకులు డా.చిట్నేని రఘు హైద్రాబాద్లో ఆస్పత్రిని నిర్మించి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్య భారత్ మల్టీ మీడియా ఆస్పత్రి ప్రారంభానికి మెట్ పల్లి పట్టణానికి చెందిన పలువురు నాయకులు హజరై ట్రస్టు చైర్మన్ డా.చిట్నేని రఘుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కారయక్రమంలో అజీమ్, ఆఫ్రోజ్, మహేందర్, సాజిద్ పాషా తదితరులు పాల్గొన్నారు.



## ధరూర్‌లో నాలుగు ఇళ్ళల్లో దొంగతనం



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 13 :** జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ గా చేసుకుని దొంగలు ఈ దోపిడికి పాల్పడ్డారు. ఈ దోపిడీలో భారీగా నగదు, బంగారం ను ఎత్తుకెళ్లారు. సోమవారం గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్న దర్యాప్తు చేస్తున్నారు. జగిత్యాల - కరీంనగర్ రహదారిపై గల ధరూర్ గ్రామంలో పథకం ప్రకారమే దొంగలు తాళం వేసిన నాలుగిళ్లలో దోపిడీకి పాల్పడినట్లు తెలుస్తోంది. ఘటన కు సంబంధించి పూర్తి వివరాలు పోలీసుల ద్వారా తెలియాల్సి ఉంది.

## రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన రేచపల్లి విద్యార్థులు

**చురకలు విలేకరి,బీర్‌పూర్ అక్టోబర్ 13 :** బీర్‌పూర్ సారంగాపూర్ మండలం రేచపెల్లి గ్రామానికి చెందిన





పలువురు విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రేచపల్లి బన్నీ, విగ్నేష్ under 17 విభాగం లో సంగారెడ్డి జిల్లా పటాన్చెరువు లో 16-17-18 తేదీల్లో జరగబోయే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటిల్లో పాల్గొంటారని రేచపల్లి స్కూల్ pd రాము తెలిపారు. వీరికి గ్రామ సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు సంజీవ్ రెడ్డి. లక్ష్మణ్ నాయక్. మరియు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

## ఉమ్మడి జిల్లా స్థాయిలో క్రీడలకు ఎంపిక



**చురకలు విలేకరి, రాయికల్, అక్టోబర్ 13 :** రాయికల్ పట్టణానికి చెందిన శ్రీ గ్రీన్ వుడ్ పాఠశాలకు చెందిన కబడ్డీ పోటీలకు పోతరాజు అద్వైత,మండ నరేందర్,సార్ల నిశ్వాంత్,మధుప్రియ క్రీడాకారులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ మహేష్ రెడ్డి సోమవారం తెలిపారు. మండల స్థాయి నుండి జిల్లా నుండి ఉమ్మడి జిల్లా స్థాయికి మా పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం క్రీడల పట్ల మాకున్న నిదర్శనం అన్నారు.పిల్లలకి చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని సూచించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాజేష్,వ్యాయామ ఉపాధ్యాయుడు సత్య,ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.

## మరో ఇద్దరిపై క్రిప్టో మోసం కేసు నమోదు

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, అక్టోబర్ 13 :** క్రిప్టో పేరుతో మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు జగిత్యాల టౌన్ ఇన్స్ పెక్టర్ పి.కరుణాకర్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల పట్టణానికి చెందిన పలువురు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యూనిటీ, మెటాఫండ్ ప్రో యాప్లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని హైద్రాబాద్కు చెందిన వరాల వెంకటేశ్వరరావు, జగిత్యాలకు చెందిన కస్తూరి శ్యాంసుందర్లు మోసం చేశారని, వారిని అరెస్టు చేసి రిమాండ్కు తరలించామని వెల్లడించారు.

# ఎంఐఎం బలోపేతానికి కృషి చేయాలి

**-కరీంనగర్ ఎంఐఎం అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్**



**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 13 :** జగిత్యాల జిల్లాలో ఎంఐఎం బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎంఐఎం అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. సోమవారం పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన జగిత్యాల పట్టణ ఎంఐఎం కార్యవర్గాన్ని ఎంఐఎం అధ్యక్షుడు, హైద్రాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు రద్దు చేస్తున్నామన్నారు.జగిత్యాల పట్టణంలోని వివిధ వార్డుల్లో నేటి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి, వార్డు కమిటిలను ఎన్నుకున్న అనంతరం జగిత్యాల పట్టణ ఎంఐఎం కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు. ఎంఐఎం పార్టీ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతుందని, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నాయకులు,కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. పట్టణంలో సభ్యత్వం ముగిసిన అనంతరం జగిత్యాల పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు.నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వ నమోదు బుక్కులను అందించారు.ఈ సమావేశంలో నాయకులు రఫీ,సుమేర్, రజీఉద్దీన్,అసద్,వాజిద్, నౌమాన్, అఫ్జల్,అనీస్, అమేర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ పదేళ్లకు వెనక్కి..

**-ఎండకాలం రాకముందే పల్లెలో త్రాగునీటి కష్టాలు**



**చురకలు విలేకరి, మల్లాపూర్, అక్టోబర్ 13 :** ఎండకాలం రాకముందే పల్లెల్లో త్రాగునీటి కష్టాలు మొదలయ్యాయి. సర్పంచులు లేక ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కరువై గ్రామాల్లో పాలన అస్థవ్యస్థంగా తయారైందని, మళ్లీ నీటి కష్టాలు పదేళ్లు వెనక్కి తీసుకెళ్లినట్లైయిందని ఆందోళన చెందుతున్న దుస్థితి మల్లాపూర్ మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే మల్లాపూర్ మండలంలోని కొత్త దామ్ రాజ్ పల్లి గ్రామంలో వారం రోజుల నుండి తాగునీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ కార్యదర్శి స్పందించకపోవడం, ఇటు మిషీన్ భగీరథ నీళ్లు గాని రాకపోవడంతో ఇటీవల మోటారు కాలిపోవడంతో నీటి సమస్య తలెత్తిందని గ్రామస్తులు చెబుతున్నారు. వారం రోజుల నుంచి మోటార్ ను పునరుద్దరించకపోవడం ప్రత్యామ్నాయ చర్యలు సంబంధిత అధికారులు చేపట్టకపోవడం వల్ల తాగునీటి కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. స్పందించాల్సిన అధికారులు స్పందిచకుండా ఈ ప్రభుత్వ హయాంలో మళ్లీ పదేళ్లలో చెరువుల కెళ్లి బిందెలు పట్టుకొని నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి గ్రామంలో నెలకొందని మహిళలు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్త ధాంరాజ్ పల్లి గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

**-ఎండా కాలం రాకముందే నీటి ఎద్దడి**

**-ఇల్లేందుల కాంతయచారి బిజెపి నాయకులు కొత్త ధాంరాజ్ పల్లి**

మండలంలోని కొత్త ధాంరాజ్ గ్రామంలో సమస్యలు నెలకొన్నా పట్టించుకునే వారు లేరు. వారం రోజులైన తాగునీరు లేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. కార్యదర్శి, ప్రత్యేకాధికారుల పాలనలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి గ్రామాలను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. గ్రామంలో ఎక్కడ చూసిన చెత్తాచెదారం పేరుకుపోయిన కార్యదర్శి స్పందించడం లేదు.

## ఘనంగా పిఎస్ఆర్ జన్మదిన వేడుకలు



**చురకలు, విలేఖరి,వెల్గటూర్,అక్టోబర్ 13 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల మాజీ మండల పరిషత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పొనుగోటి శ్రీనివాస రావు జన్మదినం పురస్కరించు కొనిఉమ్మడివెల్గటూర్ మండలం లోనిఆయనఅభిమానులుసోమ వారం కేకులు కత్తిరించి, స్వీట్లు పంచి ఘనంగా నిర్వహించారు. కిషన్ రావుపేటలో నిరుపేద కుటుంబానికి నిత్యవసర సరు కులు పంపిణి,కరీంనగర్ మాతా శిశుఆసుపత్రితోపాటు,పలుచోట్ల అన్నప్రసాద వితరణ, రక్తదానం, ఉమ్మడి వెల్గటూర్, ఎండపల్లి మండల కేంద్రాల ప్రాదాన రహ దారి కూడల్ల వద్ద పిఎస్ఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపు తూపెద్దఎత్తున ఫ్లెక్షీలనుఏర్పాటు చేశారు.జన్మదినంపురస్కరించు కొని పొనుగోటి శ్రీనివాసరావు కుటుంబసమేతంగా తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించు కొనిప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో ఉమ్మడి వెల్గటూర్ మండలం పిఎస్ఆర్ అభిమానులు పాల్గొన్నారు.




# అధ్వాన్నంగా పల్లె ప్రకృతి వనాలు

**-ఎండిపోయి ఆకులు రాలుతున్న మొక్కలు**

**-అసాంఘిక కార్యకలాపాలు,మందుబాబులకు అడ్డాగా వనం**

**-అధికారుల పర్యవేక్షణ కరువు**







**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం అక్టోబర్ (13) :** గ్రామ గ్రామాన పచ్చదనం పెంపొందించడానికి గతంలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. రకరకాల పూల మొక్కలను నాటి సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నది.గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పల్లె ప్రకృతి వనాలు ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. నిర్వహణ సరిగా లేక పచ్చని మొక్కలు ఎండిపోయి ఆకులు రాలిపోతున్నాయి.జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలంలోని గోదుర్, తిమ్మపుర్,తిమ్మపుర్ తండ, యామపుర్, వేములకుర్తి, ఫకిర్ కోండాపుర్,బర్దిపుర్, ములరాంపుర్,ఎర్దండి, కోమటికోండా పుర్, వర్షకోండ, డబ్బ,అమ్మకపెట్, ఎర్రపుర్,ఇబ్రహిం పట్నం, కేశాపుర్, కోజన్ కోత్తుర్ గ్రామంలో పచ్చని చెట్లతో ప్రజలకు ఆహ్లాదాన్ని ఇవ్వాల్సిన ప్రకృతి వనాలు చెత్త చెదారంతో నిండి పోతున్నాయి. సరైన నీటి సౌకర్యం లేక మొక్కలు ఎండిపోతున్నాయి. మరోవైపు వాటి నిర్వహణకు తగిన సిబ్బంది లేక గ్రామపంచాయతీ వదిలేసిందని,దీని ఫలితంగా ప్రస్తుతం అవి మందుబాబు లకు అడ్డాగా మారుతున్నయి.

**ఇష్టారాజ్యంగా వనాల ఏర్పాటు...**

గ్రామలలో పల్లె ప్రకృతి వనలు ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేశారు. స్థలాల ఏర్పాటులో ఇష్టరాజం తో పలు చోట్ల పాఠశాల లలో ఎర్పాటు, దేవలయాల ప్రాంగణం, కళ్యాణ మండప ప్రాంగణంలో ఎర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగేల నిర్వహిచటం తో అలంకారప్రాయంగా మిగిలిపోయాయి.

**మద్యం ప్రియులకీ అడ్డాలుగా...**

సాయంత్రం సమయంలో, రాత్రి వేళల్లో పల్లె ప్రకృతి వనంలోనే మద్యం తాగుతున్నారు.అసాంగిక కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. కనీసం గ్రామ పంచాయతీ సిబ్బంది. సైతం అటువైపు వెళ్లకపోవడంతో ఎక్కడ చూసినా తాగి పడవేసిన కాలి మద్యం సీసాలు, సిగరెట్ ప్యాకెట్లు,తాగి పడేసిన గ్లాసుల తో దుర్భరంగా కనిపిస్తూ ఉంది. ఇప్పటికైనా పల్లె ప్రకృతి వనంపై అధి కారులు దృష్టి సారించి సామాన్యుల కు అందుబాటులోకి తీసుకు రావాలని, అలాగే రాత్రివేళల్లో ప్రకతివనం మద్యం తాగే వారిపై చర్యలు తీసు కోవాలని గ్రామల ప్రజలు కోరుతున్నారు.

**గతంలో ప్రకృతి వనాలు శుభ్రంగా ఉండేది**

**సంఘం సాగర్ తాజా మాజీ సర్పంచ్ బర్దిపుర్**



సర్పంచ్ లు పదివిలో ఉన్నన్ని రోజులలో మొక్కలకు నీరు పోసి చెట్లను ఎపుగా పెంచాము. అప్పుడు ఇలాంటి జల్సాలు, అసాంఘిక కార్యకలాపాలు జరగలేదు.ప్రహరీ కంచెను ఎర్పాటు చేశాం,ప్రస్తుతం పదవీకాలం ముగిసిన తరువాత, ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

**అధికారుల పరిశీలన ఉండాలి**

**గుజ్జె గంగాధర్ బిజెపి సీనియర్ నాయకులు**



పల్లె పకృతివానాలను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి మొక్క సంరక్షణ చర్యలు చెప్పటాలి. పలుచోట్ల ప్రజలకు ఇబ్బంది కలిగే ప్రదేశాలలో పకృతి వనాల గతంలో ఎర్పాటు చేశారు.వాటిని గుర్తించి తొలగించి ప్రజల, విద్యార్థులు ఇక్కట్లు తొలగించాలి.

# రాజన్న ఆలయానికి అప్రతిష్ట తేకండి

## -ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఆక్టోబర్ 13 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ దేశంలో దక్షిణ కాశీగా పేరుపొందిన వేములవాడ రాజన్న ఆలయానికి అప్రతిష్ట తేవద్దని వివిధ పార్టీల నాయకులను కార్యకర్తలను కోరారు ఆదివారం రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన బిజెపి కార్యకర్తలు ఒక్కసారి ఆలోచించాలని కోరారు ఎన్నో సంవత్సరాల క్రింద నిర్మాణమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని విస్తరణలో భాగంగా నిర్మాణపు పనులు చేపట్టడం జరిగిందని ఈ పనిని బిజెపి నాయకులు అడ్డుకోవద్దని హితవు పలికారు ఆగమశాస్త్ర నిపుణులు సూచనల మేరకే ఆలయ విస్తరణ పనులు జరుగుతాయన్నారు గర్భగుడిని ముట్టుకోవడం లేదని రాజన్న పూజలు యధావిధిగా కొనసాగుతాయని అన్నారు కేవలం భక్తుల సౌకర్యార్థం భీమన్న గుడిలో కోడెముక్కులు నిత్య పూజలు జరుగుతాయని ఆలయ ఈవో. వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తెలిపిన బిజెపి నాయకులు తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు దేశంలో ఎన్నో పురాతన ఆలయాలను పునర్నిర్మాణం చేసినప్పుడు బాలాల యాలను నిర్మించి నిత్య పూజలు చేయడం పరిపాటిగా జరుగుతుంద న్నారు ఎన్నో రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో రాజన్న దర్శనం చేసుకుంటున్న భక్తులు రానున్న కాలంలో లక్షలాదిగా పెరుగుతారని వారి సౌకర్యార్థం ఆలయ నిర్మాణంలో విస్తరణ చేయడం తప్పేమీ కాదన్నారు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పూర్వజన్మలో చేసుకున్న పుణ్యఫలితంగానే ఈ జన్మలో ఆలయ విస్తరణ పనులు ఆయన చేతుల మీదుగా జరగడం ఆయనకు దక్కిన అదృష్టమన్నారు దేవుని ముందు అందరం సమాన భక్తుల మేనని శృంగేరి పీఠాధిపతి శ్రీ జగద్గురు పరిశీలన జరిగిన తర్వాతనే ఆలయ పనులు ప్రారంభమయ్యాయని అన్నారు ఇప్పటికైనా కొన్ని వేల సంవత్సరాలకు చరిత్రలో నిలిచిపోయే విధంగా రాజన్న గుడిని సుందరీకరించడం ఈ ప్రాంతం చేసుకున్న అదృష్టంగా భావించాలన్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎస్ కే సాబేర బేగం వైస్ చైర్మన్ గుండాటి రామ్ రెడ్డి నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్ చెన్ని బాబు నందికిషన్ గంట చిన్నలక్ష్మి మెండె శ్రీనివాస్ తిరుపతి గౌడ్ మల్లారెడ్డి గంట బుచ్చగౌడ్ బండారి బాల్ రెడ్డి గుండ్ల శ్రీనివాస్ అంతర్పుల గోపాల్ రవి తదితరులు పాల్గొన్నారు.

### కరీంనగర్ డీసీసీ అధ్యక్ష పదవి కోసం

# వెలిచాల రాజేందర్ రావు తరపున దరఖాస్తు

## -రాజేందర్ రావే డీసీసీ అధ్యక్ష పదవికి అన్ని విధాలా సమర్థుడు




**చురకలు ప్రతినిధి కరీంనగర్ ఆక్టోబర్ 13 :**కరీంనగర్ డిసిసి అధ్యక్ష పదవి ఎన్నిక కోసం ఏఐసీసీ పరిశీల కులు రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావుకు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరుతూ సోమవారం మాజీ కార్పొరే టర్లు,కాంగ్రెస్ నాయకులు డిసిసి కార్యా లయంలో దరఖాస్తు అందజేశారు. డిసిసి పిఆర్ఓలు దొంతి గోపి, న్యాత శ్రీనివాస్‌కు దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మీడియాతో మాట్లాడుతూ 1981 నుంచి కాంగ్రెస్ పార్టీలో వెలిచాల రాజేందర్ రావు ప్రస్థానం మొదలైందని పేర్కొన్నారు. 1987లో ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి యూత్ కాంగ్రెస్‌లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా,ప్రధాన కార్యదర్శిగా, సంయుక్త కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు. అదేవిధంగా రాజేందర్ రావ్ గుండి గోపాలరావుపేట సింగిల్ విండో చైర్మన్‌గా,కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్టేట్ చాంబర్ ఆఫ్ మార్కెట్ కమిటీ అసోసి యేషన్ చైర్మన్‌గా,నెడ్ క్యాప్‌గా డైరెక్టర్ పనిచేశారని చెప్పారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 2024లో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థిగా రాజేందర్రావు పోటీ చేశారనీ, ఎన్నికల్లో మూడు లక్షల అరవై వేల ఓట్లు సాధించారని తెలిపారు . అతికొద్ది సమయంలోనే భారీ ఓట్లను సాధించి రికార్డు సృష్టించారని చెప్పారు. కరీంనగర్ ప్రజలకు రాజేందర్ రావు అందుబాటులో ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటు న్నారనీ, నీతి నిజాయితీగా వ్యవహరిస్తూ మంచి పేరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ సీనియర్ కాంగ్రెస్ నేత జగపతిరావు కరీంనగర్ అభివృద్ధి ప్రదాత అనీ, వారి తనయుడు జగపతిరావు అడుగుజాడల్లో నడుస్తూ తండ్రి ఆశయ సాధనకు కృషి చేస్తూనే, కరీంనగర్ ప్రజలకు అండగా ఉంటున్నారని తెలిపారు. అదేవిధంగా రాజేంద్ర రావు తల్లిదండ్రులు జగపతిరావు సరళాదేవి పేరిట సరల్ జగ్ అనే ట్రస్టును ఏర్పాటుచేసి పేద ప్రజలకు సాయం చేస్తున్నారని పేర్కొన్నారు. నీతిగా నిజాయితీగా సౌమ్యుడిగా వ్యవహరిస్తున్న వెలిచాల రాజేందర్ రావుకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పెద్దలు డిసిసి అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరారు. రాజేందర్రావు డిసిసి అధ్యక్ష పదవికి అన్ని విధాల అర్హుడు అనీ, సమర్థుడని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ విషయాలను అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని డిసిసి అధ్యక్షుడిగా రాజేందర్ రావును నియమించాలని అధిష్టానాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆకుల ప్రకాష్, ఆకుల నరసన్న, డిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకట రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వేల్పుల వెంకటేష్, గండి రాజేశ్వర్, ఉప్పరి రవి, శ్రావణ్ నాయక్, జువ్వాడి మారుతి రావు, బాషవేణి మల్లేశం పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు ఆటల, వ్యాసరచన పోటీలు




**చురకలు విలేకరి, బీర్ పూర్, అక్టోబర్ 13 :** బీర్పూర్ మండలంలోని కొల్వాయి అంగన్వాడి సెంటర్లలో పోషణ్ మహా సందర్భంగా బీర్పూర్ ఐసిడిఎస్ సూపర్వైజర్ శైలజ ఆధ్వర్యంలో సోమవారం షెడ్యూల్ ప్రకారం పిల్లలకు ఆటల, వ్యాసరచనులు నిర్వహించారు. ఈ సందర్భంగా కోల్వాయి గ్రామం లోని ప్రాథమిక పాఠశాల లో స్కూల్ పిల్లలకు "మీరు తినే ఆహారం మీ పెరుగుదల" అనే అంశం పై వ్యాసరచన పోటీలు, "ఆహార సమూహాలు విటమిన్ రక్త హీనత, పరిశుభ్రతల"పై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్ వైజర్ శైలజ మాట్లాడుతూ ప్రీ స్కూల్ పిల్లలు అంగన్వాడి సెంటర్ రావడం వల్ల లాభాల గురించి వివరిస్తూ మూడు నుండి ఆరు సంవత్సరాల వరకు తప్పక అంగన్వాడి సెంటర్ లోనే నమోదు చేయాలని అవగాహన కల్పించారు. గృహసందర్శనల ద్వారా కిచెన్ గార్డెన్, పరిసరాల పరిశుభ్రత, లబ్ధిదారి కుటుంబ సభ్యులు ఇవ్వవలసిన ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్స్, అంగన్వాడీ టీచర్స్ ప్రభులత, లింగమ్మ, ఏ యన్ ఏం,ఆశాలు గర్భిణీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న జిల్లా ఎస్పీ

## -ప్రమాదంలో గాయడపడిన వ్యక్తిని పోలీస్ వాహనంలో ఆసుపత్రికి తరలింపు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆక్టోబర్ 13 :** సిరిసిల్ల పట్టణ పరిధిలోని బైపాస్ లో ప్రమాదం జరిగి గాయాలతో పడి ఉన్న వ్యక్తిని అటు వైపు వెళ్తున్న జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే అట్టి వ్యక్తిని గమనించి తన వాహనాన్ని అపి పైలెట్ వాహనంలో హుటాహుటిన జిల్లా ఆసుపత్రికి సకాలంలో తరలించి వైద్యం అందేలా చర్యలు తీసుకొని మానవత్వం చాటుకున్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి స్పందన




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్,అక్టోబర్ 13 :** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని విజయ క్లినిక్ లో కరీంనగర్ కు చెందిన మెడికవర్ వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. కమాన్ పూర్ మండల కేంద్రంలోని విజయ క్లినిక్ లో సోమవారం డా, విజయ్ కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్ ఆధ్వర్యంలో కరీంనగర్ కు చెందిన మెడి కవర్ హాస్పిటల్ వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిభిరం నిర్వహించడం జరిగింది. ఇందులో ఇందులో 2డి ఎకో, ఇ సిజి పరీక్షలు నిర్వహించారు. ఇ కార్యక్రమంలో డా, విజయ్ కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, లయన్స్ క్లబ్ సభ్యులు బొజ్జ రాజసాగర్, లింగమూర్తి, , మెడికవర్ ఆసుపత్రి వైద్యులు జనరల్ ఫిజీషియన్ లోకేష్, హర్షిత్ లతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కుటుంబాలను పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 13 :** రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పలు కుటుంబాలను సోమవారం పరామర్శించారు. ముత్తారం మండల పరిధిలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో ఎడ్ల మల్లయ్య కుమారుడు ఎడ్ల అజయ్ మరణించగా వారి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు వారివెంట ముత్తరాం మండల అధ్యక్షులు దొడ్ల బాలాజీ మండల మైనార్టీ అధ్యక్షులు వాజిద్ పాషా మరియు సీనియర్ నాయకులు లక్కమ్ ప్రభాకర్ మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు హాజరయ్యారు.

### టౌన్ డివిజన్ పరిధిలోని

# కొరియర్, కార్గో సెంటర్లలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

**-ప్రజల భద్రతే లక్ష్యం - సీపీ గౌష్ ఆలం**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 13 :** కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని టౌన్ డివిజన్‌లో ఉన్న కొరియర్ ఆఫీసులు, కార్గో సెంటర్లు మరియు పార్సెల్ సెంటర్లలో పోలీసులు ఈరోజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలకు పోలీసు కమిషనర్ శ్రీ గౌష్ ఆలం ఐపీఎస్ గారు స్వయంగా బస్టాండ్ మరియు ఆర్టీసీ కార్గో కార్యాలయం వద్ద పర్యవేక్షించారు.

**తనిఖీలలో పాల్గొన్న పోలీసు జాగిలాలు:**

నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను గుర్తించేందుకు ఈ తనిఖీల్లో ప్రత్యేకంగా శిక్షణ పొందిన పోలీసు జాగిలాలు 'రాంబో' (ట్రాకర్), 'లియో' (నార్కోటిక్), 'మైకి', మరియు 'టైసన్' (స్నిఫర్) పాల్గొన్నాయి.

**ఏకకాలంలో విస్తృత తనిఖీలు:**

టౌన్ డివిజన్ పరిధిలోని కిసాన్ నగర్, బొమ్మకల్ చౌరస్తా, హౌసింగ్ బోర్డు కాలనీ, రామ్ నగర్, ముఖరాంపుర, జ్యోతి నగర్, కాశ్మీర్ గడ్డ, గోదాం గడ్డతో పాటు పలు ముఖ్య ప్రాంతాలలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న కొరియర్, కార్గో కార్యాలయాలలో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ ఆకస్మిక తనిఖీల గురించి పోలీసు కమిషనర్ శ్రీ గౌష్ ఆలం ఐపీఎస్ గారు మాట్లాడుతూ, "కొరియర్, కార్గో మార్గాల ద్వారా ఆబ్జెక్షన్ మెటీరియల్ అయిన నిషేధిత మాదక ద్రవ్యాలు, గంజాయి, ఎక్స్‌ప్లోజివ్స్, ఫైర్ ఆర్మ్స్ అక్రమంగా రవాణా అవుతున్నాయనే అనుమానంతో ఈ తనిఖీలు నిర్వహించాం. ప్రజల రక్షణార్థం మరియు అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈ ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తాం" అని స్పష్టం చేశారు. ప్రజలు పోలీసులకు సహకరించి, అనుమానాస్పద పార్సెల్‌లు లేదా కార్యకలాపాల గురించి సమాచారం అందించాలని సీపీ ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, జాన్ రెడ్డి , పుల్లయ్య ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్జీ కోల్ మైన్ ప్రాజెక్ట్ పనులను త్వరితగతిన పూర్తిచేయండి

**-డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్)**

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ అక్టోబర్ 13 :** రామగుండం కోల్ మైన్ ప్రాజెక్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేయలని డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జి.ఎం కార్యాలయం నందు రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు తోపాటు సంబధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆర్జీ కోల్ మైన్ ప్రాజెక్ట్ పురోగతి పనులు, ఓసిపి-2 ఉపరితల గని పురోగతి పనులు, సి-5 ఓబి (మట్టి వెలికితీత) పై డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కొప్పుల వెంకటేశ్వర్లు చర్చించి, దిశానిర్దేశం చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగుండం కోల్ మైన్ ప్రాజెక్ట్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, అందుకు కావలసిన ప్రణాళికలను రూపొందించుకోవాలని, అలాగే ఓసిపి-2 ఉపరితల గని పురోగతి పనులు త్వరగ పూర్తి చేయాలని, నిర్దేశించిన ఓ.బి (మట్టి వెలికితీత), బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించే దిశగా ఎప్పటికప్పుడు కార్యాచరణ సిద్ధం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. ప్రస్తుతం మార్కెట్ లో ఉన్న పరిస్థితుల పట్ల ఉద్యోగులకు అవగాహన కల్పిస్తూ లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలన్నారు. భద్రతతో కూడిన ఉత్పత్తి, రవాణా సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా 6 నెలల సమయం ఉందని, ఏరియాకు నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తూ,ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలని కోరారు. అనంతరం అడ్రియాల లాంగ్ వాల్ గనిని సందర్శించి నడుస్తున్న పనుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సమావేశంలో రెస్క్యూ జీ.ఎం కె.శ్రీనివాస్ రెడ్డి, ఏరియా ఇంజినీర్లు వై.వి.శేఖర్ బాబు, కె. యాదయ్య, ఎస్వోటుజిఎంలు ఎం.రామ్మోహన్, బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్లు సి.హెచ్.వెంకటరమణ, జె.రాజ శేఖర్,పర్యావరణ అధికారి రాజారెడ్డి, ఎస్టేట్స్ అధికారి ఐలయ్య, ప్రాజెక్ట్ ఇంజినీర్లు ఉదయ్ భాస్కర్, చంద్ర శేఖర్,రఘురామ్,మేనేజర్లు పాపయ్య, కె.వి.రామరావు,పెంచలయ్య, సుధాకర్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షబ్బిరుద్దీన్, ఇతర అధికారులు, సి5 అధికారులు పాల్గొన్నారు.




# జిల్లా కాంగ్రెస్, నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు కాంగ్రెస్ నేతల దరఖాస్తులు





**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 13 :** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ మరియు నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆశిస్తున్న ఆశవహుల నుండి నేడు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించడం జరిగింది. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయ కార్యదర్శులు నాత శ్రీనివాస్,దొంతి గోపి లకు ఆశావహులు దరఖాస్తులను నేరుగా అందజేయడం జరిగింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆశిస్తూ 32 మంది దరఖాస్తు చేసుకోగా, నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోరుతూ 22 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు సమర్పించిన వారిలో వెలిచాల రాజేందర్ రావు, వైద్యుల అంజన్ కుమార్, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఆరేపల్లి మోహన్, పత్తి కృష్ణారెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, శ్రీమతి కర్ర సత్య ప్రసన్నా రెడ్డి, కాశి పాక రాజేష్, సత్తు మల్లేశం, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఆకారపు భాస్కర్ రెడ్డి, ఉట్కూరి నరేందర్ రెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, నెల్లి నరేష్ మహమ్మద్ తాజుద్దీన్, మాచర్ల ప్రసాద్, దాసరి భూమయ్య, తిప్పారపు సంపత్, మహమ్మద్ ఖాలీముద్దీన్, మ్యాకల రవీందర్, సయ్యద్ జమాలుద్దీన్, మూల జైపాల్ మహమ్మద్ అబ్దుల్ సలాం, ఎస్.కె సిరాజ్ హుస్సేన్, శ్రీపురం నాగప్రసాద్, పడాల రాహుల్, దీకొండ శేఖర్, రుద్ర సంతోష్,ప్యాట రమేష్,గూడెపు సారంగ పాణి,చర్ల పద్మ ఉన్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోరుతూ దరఖాస్తు చేసిన వారిలో బానోతు శ్రావణి నాయక్ ముల్కల ప్రవీణ్ షబానా మహమ్మద్, కొరివి అరుణ్ కుమార్, మహమ్మద్ తాజుద్దీన్, మాచర్ల ప్రసాద్ సయ్యద్ ముజీబ్ హుస్సేన్ కంకణాల అనిల్ కుమార్ సర్దార్ ధన సింగ్ మహమ్మద్ అబ్దుల్ సలాం అస్తపురం రమేష్ ఎస్.కె సిరాజ్ హుస్సేన్ మహమ్మద్ జమాలుద్దీన్ అబ్దుల్ రెహమాన్ బోనాల శ్రీనివాస్ కొట్టే ప్రభాకర్ దీకొండ శేఖర్ గడ్డం శ్రీనివాస్ వీర దేవేందర్ పటేల్ వైద్యులు అంజన్ కుమార్ మహమ్మద్ ఇంతియాజ్ అలీ ఉన్నారు. స్వీకరించిన దరఖాస్తులను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో ఏఐసిసి టిపిసిసి పరిశీలకులకు అందజేయడం జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ కార్యాలయ కార్యదర్శులు తెలిపినారు.

## నిరాధరిస్తున్న కన్న కొడుకు

**-సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్‌ను ఆశ్రయించిన వృద్ధురాలు**



**చురకలు విలేకరి, జగిత్యాల, అక్టోబర్ 13 :** జగిత్యాల పట్టణంలోని హనుమన్ వాడ కు చెందిన (72 )మాధారపు కనుకమ్మ అనే అనారోగ్యం తో భాదపడుతున్న వృద్దురాలిని కన్న కొడుకు నిరాదరిస్తూ ఇంటిలో నుంచి గెంటి వేయడంతో అదే వాడలో ఉన్న ఓ షెడ్డులో కిరాయికి ఉంటూ దుర్భరస్థితిలో తన పెళ్లి కాని కూతురుతో జీవిస్తున్నానని జగిత్యాల జిల్లా సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాది హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించింది. ఈ మేరకు వారి సాయంతో ఆర్డీవో మధుసూదన్ కు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు లో వివరాలు తెలుపుతూ విలేఖరుల సమక్షంలో రోదిస్తూ తెలిపింది. తన పెద్ద కుమారుడు ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ నా భర్త గంగారామ్ ద్వారా సంక్రమించిన ఇంటిని, స్థలము లను మోసపూరితంగా తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని, తన వద్దనుండి రూ. 10 లక్షలు, 15తులాల బంగారం కూడా తీసుకొని ఇవ్వడం లేదని, అవివా హిత కూతురు శాంత తో బ్రతుకు భారంగా వెళ్ళదీస్తున్న నాకు ఇవ్వాల్సిన డబ్బు, బంగారం ఇప్పించాలని, తనకు, తన అవివాహిత కూతురు ప్రతినెలా పోషణ, వైద్య ఖర్చులు తన కుమారుడు గంగాదర్ నుంచి ఇప్పించాలని ఆర్డీవో కు, ఎస్పీ, కలెక్టర్ లకు సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ద్వారా పిటిషన్ ఇచ్చినట్లు వృద్దురాలు కనుకమ్మ తెలిపింది. వృద్దురాలి వెంట సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, కార్యదర్శులు గౌరిశెట్టి విశ్వనాతం, బొబ్బాటి కరుణ, కౌన్సిలింగ్ అధికారులు పి. హన్మంత్ రెడ్డి,విఠల్, పట్టణ అధ్యక్షులు మానాల కిషన్ తదితరులున్నారు.

## పుట్టినరోజు వేడుకలో చెట్టు నాటడం

**-పర్యావరణానికి అంకితంగా గౌడ సత్తన్న కుటుంబం**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ అక్టోబర్ 13 :** సింగరేణి ఉద్యోగి, పర్యావరణ ప్రేమికుడు గౌడ సత్తన్న గారి కుమార్తె వైష్ణవి పుట్టినరోజును పురస్కరించుకొని ఆదివారం నాడు సింగరేణి సెంటనరీ కాలనీలోని మార్కెట్ ఏరియాలో చెట్టు నాటడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగిరి ఏఎస్ఐ శ్రీ వినోద్ గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరహా సాంప్రదాయాలతో పుట్టినరోజులు జరుపుకోవడం యువతకు ఆదర్శంగా నిలుస్తుంది. ఒక్కొక్కరి చొరవతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. ఒక చెట్టు నాటితే అది తరం తరం ప్రాణ వాయువునందిస్తుంది అని పేర్కొన్నారు. అనంతరం గౌడ సత్తన్న గారు మాట్లాడుతూ పిల్లల పుట్టినరోజులు కేకుల కంటే ఇలా చెట్లు నాటడం వల్ల వారిలో సహజ ప్రేమ, ప్రకృతి పట్ల గౌరవం పెరుగుతుంది అన్నారు. ఆయన నేటి తరానికి పర్యావరణంపై చైతన్యం కలిగించాలనే ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం కుటుంబ సభ్యుల పుట్టినరోజుల సందర్భంగా చెట్లు నాటుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, సెంటనరీ కాలనీ నివాసితులు పాల్గొన్నారు.

# వృద్ధ దంపతులపై హత్యాయత్నం.. నిందితుడు అరెస్టు

**చురకలు క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్,అక్టోబర్ 13 :** కరీంనగర్ జిల్లా, గంగాధర పోలీసు స్టేషన్ పరిధిలోని గర్షకుర్తి గ్రామంలో ఇటీవల జరిగిన వృద్ధ దంపతులపై హత్యా యత్నం,హత్య కేసులో గంగాధర పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కత్తి శివ (37)ను అరెస్టు చేసి,అతని వద్ద నుండి దొంగిలించిన బంగారు ఆభరణాలు మరియు నేరానికి ఉపయోగించిన మత్తు మాత్రలను,సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా కరీంనగర్ సిపి సోమవారం మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు.గర్షకుర్తి గ్రామానికి చెందిన గజ్జల శంకరయ్య (76), అతని భార్య గజ్జల లక్ష్మి (70) అనువారు ఒంటరిగా ఉంటున్నారు.వారి ఇంటికి సమీపంలో ఉండే నిందితుడు కత్తి శివ అనునతను అప్పుడప్పుడు వారికి బయట నుండి మందులు, అవసరము ఉండే ఇంటి సామానులు తెచ్చి ఇచ్చి సహాయపడేవాడు.శివ ఈ మధ్య ఆన్ లైన్ లో బెట్టింగ్‌లు, పేకాట లాంటి వాటికి అలవాటు పడి,అప్పులు ఎక్కువ అయి,ఖర్చులు,జల్సాల నిమిత్తం డబ్బులు అవసరము అయి,గజ్జల శంకరయ్య మరియు లక్ష్మిలను చంపి, లక్ష్మీ మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును దొంగిలించాలని పథకం వేశాడు.కానీ వారిని డైరెక్ట్‌గా హత్య చేస్తే దొరికిపోయి తనకు శిక్ష




పడుతుందని, వారికి తెలియకుండా, వృద్ధులు వాళ్ళకే ఏదో అనారోగ్యం వచ్చి చనిపోయారు అని క్రియేట్,చేసివాళ్ళు చనిపోయిన తరువాత బంగారం దొంగ తనం చేయాలన్న ఉద్దేశ్యముతో, ప్లాన్ ప్రకారం తాను గతంలో ముంబైలో కల్లు దుకాణంలో పని చేస్తున్నప్పుడు, కల్లు దుకాణము యజమాని మత్తు కోసం కల్లులో కలిపే టాబ్లెట్లు ఎవరికి తెలియకుండా దాచుకుని,ప్లాన్ ప్రకారం తేదీ అక్టోబర్ 7, 2025 ఉదయం 08:30 గంటల సమయంలో, శంకరయ్య, లక్ష్మిలకు జ్వరం,జలుబు, దగ్గు మరియు ఒళ్లు నొప్పులు ఉన్నా యని తెలుసుకొని,వారి ఇంటికి తన దగ్గరున్న మత్తు మాత్రలు ఆ వృద్ధుల వద్దకు తీసుకపోయి,ఇవి వేసుకుంటే మీ జ్వరం,జలుబు,దగ్గు మరియు ఒళ్లు నొప్పులు వెంటనే తగ్గుతాయని నమ్మించి,అ ఇద్దరు వృద్ధులు ఒక్కొక్కరు ఆరు మాత్రలు చొప్పున మింగేలా చేశాడు. అవి మింగిన సుమారు రెండు గంటల తరువాత ఆ ఇద్దరు వృద్ధులు మత్తులోకి అపస్మారక స్తితిలోకి వెళ్లిన తర్వాత, నిందితుడు వారి ఇంటికి వెళ్ళి, లక్ష్మి మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును దొంగిలించి పరారయ్యాడు. అనంతరం అదే రోజు గ్రామంలోని కట్ల శ్రీనివాసాచారి అనే గోల్డ్ స్మిత్ వద్ద ఆ బంగారాన్ని అమ్మి రూ.1,85,000/- నగదు తీసుకున్నట్లు విచారణలో నిందితుడు అంగీకరించాడు. ఆ బంగారం కొన్నటువంటి శ్రీనివాసాచారి వద్ద గతములో కత్తి శివ తన బార్య బంగారు నగలు అమ్మయినందున, అతను నమ్మి, ఆ బంగారం కొని, శివకు డబ్బులు ఇవ్వడం జరిగినది. బంగారం వ్యాపారి ఇచ్చిన డబ్బులు శివ తన అప్పులు తీర్చుకోవడం, పేకాట, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల కోసం ఆ డబ్బును ఖర్చు చేసినట్లు తెలిపాడు. అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధులు శంకరయ్య మరియు లక్ష్మిని సాయంత్రం ఆసుపత్రికి తరలించగా, అక్టోబర్ 08, 2025 మధ్యాహ్నం శంకరయ్య చికిత్స పొందుతూ మరణించాడు. వృద్ధురాలు లక్ష్మి ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగా ఉన్నది.

**నిందితుడి అరెస్టు, స్వాధీనం:**

నిందితుడు కత్తి శివ S/o దేవయ్య, వయస్సు 37 సంవత్సరాలు, R/o ఘర్షకుర్తి అనునతను ఈరోజు తేదీ 13.10.2025 నాడు ఉదయం మిగిలిన మత్తు మాత్రలను పారేయడానికి వెళ్తున్న సమయంలో పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించి, పారిపోతుండగా పట్టుకున్నారు.నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న నగదు: రూ. 25,000లు, 11 బ్లూ కలర్ కవర్ లో గల మత్తు మాత్రలు , 20 గ్రాములు 250 మిల్లీగ్రాముల బరువుగల బంగారు పుస్తెల తాడు (కట్ల శ్రీనివాస జ్యువెలరీ షాప్ యజమాని కట్ల శ్రీనివాసు నుండి),టెక్నో ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ మరియు సిమ్ కార్డు.వ్యసనాలు, అప్పుల కారణంగానే నిందితుడు ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నిందితుడిపై హత్య, దోపిడీ తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. మొదట అనుమానాస్పద మృతిగా ఈ కేసును నమోదు చేసుకుని, డెటెక్ట్ చేయుటకు ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీస్ విజయ కుమార్,ఏ.సి.పి రూరల్ ఆద్వర్యంలో,ప్రదీప్ కుమార్,ఇన్స్ పెక్టర్ ఆఫ్ పోలీస్, చొప్పదండి,వంశీకృష్ణ, ఎస్.ఐ ఆఫ్ పోలీస్ గంగాధరచారి హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ లు జంపన్న మరియు అరవింద్ లను కమిషనర్ అభినందించినారు.

# సరస్వతి నిలయంగా మంథని అభివృద్ధి

**-రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి డి.శ్రీధర్ బాబు**

**-45 కోట్లతో మంథని కు నూతన ఏ.టి.సి మంజూరు**

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (మంథని), అక్టోబర్ 13 :** సరస్వతి నిలయంగా మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు,శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కోరారు.సోమవారం రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మంథని క్యాంపు కార్యాలయంలో రామగిరి కమాన్ పూర్ మంథని ముత్తారం మండలాలకు సంబంధించి 87 మంది లబ్ధిదారులకు సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులు, 38 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భం గా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ,ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి వారం లోనే ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరిగిందని అన్నారు. వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వ



ఉద్యోగులను అప్పటి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేసిందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సకాలంలో వేతనాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు.ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందించే చెక్కులు, కళ్యాణ లక్ష్మి వంటి సంక్షేమ పథకాలు అమలు ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామని అన్నారు.ఆరోగ్యశ్రీ వర్తించని పేద ప్రజలను ఆదుకునేం దుకు సీఎం సహాయ నిధి నుంచి రికార్డు స్థాయిలో నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు.పరిశ్రమల్లో అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించే దిశగా ఐటిఐ కేంద్రాలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేయడం జరిగిందని అన్నారు. ఏ.టి.సి కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని,ఇటీవలే కాటారం లో 35 కోట్ల రూపాయలతో ఏటిసి ప్రారంభిం చామని మంత్రి తెలిపారు.45 కోట్ల రూపాయల ఖర్చు చేసి మంథని పట్టణంలో నూతనంగా ఏటీసీ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. సరస్వతి నిలయంగా మంథని నియోజకవర్గం తీర్చిదిద్దుతున్నామని అన్నారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ ఏ.టి.సి కేంద్రం ఏర్పాటు కాబోతుందని,దీనికి సహకరించిన ముఖ్యమంత్రికు మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఉమ్మడి రాష్ట్రంలో తమ హయాంలో ఇంజ నీరింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఐటిఐ సెంటర్, రైతు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు.యువతకు మార్గదర్శకం చేసేందుకు ఏ.టి.సి సెంటర్ ఏర్పాటు కాబోతుందని అన్నారు.మంథని ప్రజలకు ఉపయోగ పడే విధంగా పట్టణంలో వివిధ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి 10 కోట్ల రూపాయలు మంజూరు చేశామని అన్నారు.పట్టణంలో నిర్మించే కమ్యూనిటీ హాల్స్ మంథని ప్రజలు ఎవరైనా ఉప యోగించుకోవచ్చని అన్నారు.మంథనీ పట్టణ హెడ్ క్వార్టర్‌లో 30కోట్ల రూపాయలతో అంతర్గత సిసి రోడ్లు వేసామని,అంబేద్కర్ విజ్ఞాన్ భవన్ నిర్మాణానికి కోటి రూపాయలు, మున్నూరు కాపు భవనానికి 60 లక్షల రూపాయలు మంజూరు చేసామని అన్నారు.మధుర పోచమ్మ ఆలయ అభివృద్ధికి 25 లక్షల,వినాయక మండపం 10 లక్షలు, మహా లక్ష్మి దేవాలయానికి 10లక్షలు,చిన్నప్ప- పెద్దప్ప ఆలయానికి 10లక్షలు, మహిళా భవనానికి 50 లక్షల కేటాయించామని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు రిక్రియేషన్ అయ్యేందుకు 50 లక్షల మంజూరు చేశామని అన్నారు.పేద ప్రజల ఇంట్లో వివాహాల సమయంలో ఇబ్బందులు కాకుండా ఉండేందుకు కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తున్నామని అన్నారు. ప్రతి కమ్యూనిటీ వాళ్లు చిన్న కమిటీ ఏర్పాటు చేసుకుని త్వరగా తిను కమిటీ హాల్స్ నిర్మాణం పూర్తి చేసుకోవడంలో కృషి చేయాలని అన్నారు. కమిటీ హాల్స్ నిర్మాణానికి అవసరమైన భూమి ఎంపిక చేసి త్వరగా టెండర్లు పిలవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.ఏటీసీ కేంద్రంలో చదివే విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతినెల 2000 రూపాయలను స్కాలర్షిప్ అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ. సురేష్, తహసిల్దార్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యూనిసెఫ్ కార్యక్రమాలపై సమీక్ష



**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 13 :** యూనిసెఫ్ సహకారం తో రానున్న రోజుల్లో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా జిల్లాలో చేపట్టే వివిధ కార్యక్రమాలపై ఆ సంస్థ అధికారులతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సమావేశమయ్యారు.ఈనెల 15న గల గ్లోబల్ హ్యాండ్ వాష్ డే,స్వచ్ఛ హరిత విద్యాలయాల నమోదు, అంగన్వాడీలు ,ఆరోగ్య కేంద్రాల్లో తాగునీరు,పారిశు ధ్యం మెరుగుపరచడం వంటి విషయాల పై ప్రతినిధులతో చర్చించారు. జిల్లాలో పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. స్వచ్ఛ హరిత విద్యాలయాల నమోదులో భాగంగా జిల్లాలోని పాఠశాలల్లో విజయ వంతంగా సాగుతున్న విటమిన్ గార్డెన్ గురించి తెలియజేయాలని అన్నారు. సమావేశంలో యూనిసెఫ్ వాష్ స్పెష లిస్ట్ ఆర్లికట్టి వెంకటేష్,కన్సల్టెంట్ ఫణీంద్ర, స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా సమన్వయ కర్తలు వేణు, రమేష్ పాల్గొన్నారు.

# హుజురాబాద్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులుగా ఉస్మాన్ పాషా, జయవర్ధన్





**చురకలు ప్రతినిధి హుజురాబాద్ అక్టోబర్ 13** : తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం హుజురాబాద్ యూనిట్ అధ్యక్షులుగా మహమ్మద్ ఉస్మాన్ పాషా, ప్రధాన కార్యదర్శిగా గంజి జయ వర్ధన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం వారి విలేకరులతో మాట్లాడుతూ.. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. తమకు అవకాశం ఇచ్చిన ఉద్యోగులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని, అధ్యక్ష కార్యదర్శులు అయిన ఉస్మాన్ పాషా, జయవర్ధన్లను ఇండిపెండెంట్ జర్నలిస్ట్ ఆవునూరి సమ్మయ్య, రవిశంకర్ శుక్ల, మేకల రాజిరెడ్డి, కళ్లెపు మోహన్రావు, మురికి శివ దయాల్, పుల్లా నతనియల్, బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, కొన్ని రాజిరెడ్డి, దేవేందర్ రెడ్డి, సోల్లు దశరథం, పులి జగన్నాథం, కేతిరి లక్ష్మారెడ్డి తదితరులతో పాటు పలువురు ఉపాధ్యాయ సంఘాల, ఉద్యోగ సంఘాల నాయకులు అభినందించారు.

# పూర్వ ప్రాథమిక కేంద్రాలలో నమోదు పెంచాలి

**-జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ అక్టోబర్ 13 :** జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ కేంద్రాలలో నమోదును పెంచాలని, ప్రతి కేంద్రంలో 20 మంది పిల్లలు తగ్గకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎంఈఓలు, ఎంపీడీవోలు, సిడిపివోలతో పూర్వ ప్రాథమిక పాఠశాలలపై సమీక్షించారు.జిల్లాలో నిర్వహిస్తున్న 20 పూర్వ ప్రాథమిక కేంద్రాల్లో నమోదు తక్కువగా ఉందని, వారం రోజుల్లోగా ప్రతి కేంద్రంలో 20 మంది పిల్లలను నమోదు చేయించాలని ఆదేశించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కేంద్రాల్లో ఇప్పటికే ఇన్స్ట్రక్టర్, ఆయా నియామకం పూర్తయిందని తెలిపారు. ఐసిడిఎస్, విద్యాశాఖ, ఎంపీడీవోలు సమన్వయంతో ఈ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పన పూర్తి చేయించాలన్నారు. సమర్థవంతంగా కేంద్రాలను నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, సిడిపివోలు, ఎంపీడీవోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.